క్లుప్తంగా

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలియజేస్తున్న మద్ది కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు, జిల్లా అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటూ, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతమైన పదవులు సాధించాలని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ ఆర్గనైజింగ్ ఇన్‌చార్జిగా కార్తీక్‌రెడ్డి



కార్తీక్‌రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఆర్గనైజింగ్ ఇంచార్జిగా యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూమహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు చేస్తానన్నారు. నియోజకవర్గంలో రెండు మండలాలు, కార్పొరేషన్లు, డివిజన్లు, మున్సిపాలిటీలలో త్వరలో పర్యటించి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కేసీఆర్, కేటీఆర్, సబితారెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫణిగిరికాలనీ, మోహన్‌నగర్, బ్యాంక్‌కాలనీ, యాదవనగర్, చాణక్యపురి, సౌత్‌ఎండ్‌పార్కు, మదర్ డెయిరీ, గొరెల్లి, పసుమాముల ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ శివాలయం, న్యూ నాగోలు, శివపురి, గ్రీన్ హిల్స్, రాజీవ్ స్వగృహ, హుడాసాయినగర్, మదర్ డెయిరీ, గొరెల్లి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఘనంగా శ్రీవారి రథోత్సవం



స్వామివార్లను పురవీధుల్లో ఊరేగిస్తున్న నిర్వాహకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యఅవతార వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతా మూర్తుల విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో భక్తుల కోలాటం ఆకట్టుకుంది. ఆలయ ఫౌండర్ చైర్మన్ సంజయ్ గోపాల్ సైంజర్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్‌కి అనుమతుల్లేవు

మండల విద్యాధికారి కృష్ణ

మహేశ్వరం: మహేశ్వరంలో శ్రీచైతన్య స్కూల్‌కి ఎలాంటి అనుమతులు లేవని మండల విద్యాధికారి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీచైతన్య స్కూల్ పేరు మీద అడ్మిషన్లు తీసుకుంటున్న విషయం తమకు తెలిసిన వెంటనే స్కూల్ మేనేజ్‌మెంట్‌కు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అయినప్పటికీ అడ్మిషన్లు తీసుకుంటున్నారని, ఈ విషయంలో మరిన్ని ఫిర్యాదులు అందినట్లు వివరించారు. అడ్మిషన్ల విషయంలో తల్లిదండ్రులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేని స్కూల్లో పిల్లలను చేర్పించొద్దని ఆయన సూచించారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న మేనేజ్‌మెంట్‌పై కఠిన చర్యలకై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

- ప్రతిరోజూ 2గంటల సమయం కేటాయింపు
- శిక్షణా శిబిరాలకు పరుగులు



యోగా చేస్తున్న విద్యార్థులు



శిక్షణ ఇస్తున్న ఇస్మాయిల్ గురుజీ

హుడాకాంప్లెక్స్: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. యుక్త వయస్సు వచ్చేనాటికి విద్యార్థులుగా ఉన్నప్పుడే ఆట పాటలతో శరీరాన్ని బలంగా, ధృడంగా తయారు చేసుకోవాలి. ప్రస్తుత విద్యా విధానంలో ఆటలకు వ్యాయమాలకు స్థానం లేకుండా పోయింది. దీంతో పిల్లలు శారీరక ధృడత్వాన్ని కోల్పోతున్నారు. ఇటువంటి తరుణంలో ఋషులు అందించిన యోగా సాధన పద్ధతుల వైపు మొగ్గు చూపుతున్నారు. శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవడం కోసం విద్యార్థులు వేసవి సెలవులను వేదికగా చేసుకున్నారు. అందుకు తగ్గట్లుగా వేసవి శిబిరాల్లో శిక్షణకు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా బాల వికాస్ యోగా శిక్షణా తరగతులు సరూర్‌నగర్‌లోని హుడాకాంప్లెక్స్‌లో ఉన్నటువంటి లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్లో గురు నిలయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనికి మంచి స్పందన వస్తుంది. ప్రతీరోజు 2గంటల సమయం కేటాయించి అభ్యాసనం చేస్తున్నారు. పిల్లలు మానసిక శారీరక పరిస్థితులకనుగుణంగా మార్పు తెచ్చుకుంటున్నారు. నిర్వాహకులు జీవిత పాఠాల్లో భాగంగా ఆధ్యాత్మిక సందేశాలను పాటల రూపంలో అందజేస్తూ పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతున్నారు. స్వధర్మయోగి సేవా రత్న అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురూజీ 20 సంవత్సరాలుగా యోగా శిక్షణ ఇస్తున్నారు. మానసికంగా కృంగిపోయేవారికి మానసికంగా ధృడంగా ఉండడానికి కావలసిన కొన్ని కొత్త ప్రాణాయామాలు నేర్పిస్తున్నారు. ఇలా సగటు వ్యక్తి ఎదుర్కొంటున్న మానసిక, శారీరక సమస్యలు యోగాతో దూరమవుతున్నాయని చెబుతున్నారు. లోటస్ ల్యాప్ స్కూల్లో ఈ నెల 22 నుంచి రెండో బ్యాచ్ ప్రారంభించారు. వెన్ను నొప్పులు, షుగర్, మోకాళ్ల నొప్పులకు నూతన విధానం ద్వారా తగ్గిస్తారన్నారు.

ధనురాసనంతో మేలు



ధనస్సు లాగా, బాణం లాగా ఉంటుంది. కాబట్టి దీనికి ధనుర్ ఆసనం అని పేరు. పిల్లలు ఎక్కువ సమయం ముందుకు వాలి క్లాస్ రూములో కూర్చోవ డం, కంప్యూటర్ ముందుకు చూడడం, మెడనొప్పి, నడుము నొప్పి వంటి సమస్యలు ఎదుర్కొంటారు. అలాంటి వారికి ధనుర్ ఆసనంతో నయం చే యొచ్చు. ఇటీవల కాలంలో హోంవర్క్ కూడా ఎ క్కువగా ఇవ్వడంతో పిల్లలకు వెన్నుపూసల మధ్య కొంత ఖాళీ ఏర్పడి తొందరగా అలసిపోతున్నారు. అటువంటి పిల్లలకు ఈ ఆసనం మేలు చేస్తుంది. – లక్ష్మీ వైష్ణవి, హుడాకాంప్లెక్స్

తిట్టిభాసనంతో శరీరం క్రమస్థితికి..



ఈ ఆసనంలో మొదట నిటారుగా నిలబడి రిలాక్స్ అవ్వాలి. శరీరాన్ని ముందు వైపున కిందకు వంచుతూ చేతులను నేలపై ఉంచాలి. రెండు మోకాళ్లను కొద్దిగా మడిచి రెండు చేతులను కాళ్ల లోపలి నుంచి తీసుకెళ్లి అరచేతులను పాదాల వెనుకాల నేలపై పెట్టాలి. రెండు భుజాలను వెనుకవైపు మోకాళ్లకు సపోర్టుగా ఉంచుకోవాలి. ఇలా బ్యాలెన్స్ సెట్ అ య్యాక శరీర బరువును పూర్తిగా చేతులపై వేసి రెండు పాదాలను ముందుకు తీసుకొచ్చి బొటనవ్రేళ్లను కలపాలి. తర్వాత రెండు కాళ్లను ముందుకు చూ పిస్తూ సాగదీయాలి. – బిందు

మానసిక ప్రశాంతత..



యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఏ రోగం దరిచేరదు. ప్రతీ రోజు మానసిక ప్రశాంతతతో పాటు సమయానుకూలంగా ఆకలి, నిద్ర ఉంటుంది. దీంతో ప్రతీ ఒక్కరూ యోగ అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు.

ఉపయోగాలు..

- చేతులు, మణికట్టుకు భలాన్నిస్తుంది
- మొండెం, గజ్జలను సాగదీస్తుంది
- జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది
- మనసును ప్రశాంతంగా ఉంచుతుంది

– ఇస్మాయిల్ గురుజీ



పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

హాజరైన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: ఊట్లపల్లి పరిధిలోని దేవునిగుట్టపై కొలువైన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ధర్మకర్త టి లక్ష్మణ్ ముదిరాజ్, వేద పండితుడు రేవెళ్ల రాజుశర్మ సమక్షంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. అంతకుముందు సర్వదేవతలకు అభిషేకం, పూజలు, సుదర్శన, శ్రీరుద్ర, ఆంజనేయ హోమాలు చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ, ఆండాల్, చెన్నకేశవస్వామి వార్ల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాలకు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, జి.రాజేందర్ రెడ్డి, అంజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బి.మల్లేష్, మాజీ సర్పంచులు ఇ.రాంచంద్రారెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు హాజరై ప్రత్యే పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్, రవి, చెన్నయ్య, ఊటు మహేందర్, దామోదర్‌రెడ్డి, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటక ప్రదర్శన



వీధి నాటకంలో పాటలు పాడుతున్న కళాకారులు

షాబాద్: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకం బుధవారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో ఘనంగా జరిగింది. వీధి నాటకం మూడో రోజు రాత్రి నాటకంలో బ్రహ్మంగారు, గోవిందమ్మ, శివ కోటయ్య, ప్రమదాంబ వేశధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి. నేటికి ఇంకా గ్రామాల్లో వీధి నాటకాలపై ప్రజలకు మంచి ఆసక్తి ఉందన్నారు. ఈ నాటకాన్ని పంతులు గంగపూరం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగపూరం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరళ రాంచంద్రారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పెద్దఅంబర్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూమిలో కొంతభాగంగా ఔటర్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద ప్లాట్లు ఇవ్వగా.. మిగిలిన భూమిని పీఓటీ ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పట్టాపాసుపుస్తకాలను రద్దు చేసిందన్నారు. అయితే విజయవాడ జాతీయ రహదారికి అనుకుని ఈ భూములకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడంతో పాటు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

వెలగని వీధి దీపాలు

- ఇబ్బందుల్లో కాలనీ వాసులు
- పట్టించుకోని అధికారులు



ఓ వీధిలో మధ్యాహ్నం వెలుగుతున్న వీధి దీపం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేట గ్రామ పరిధిలోని మహమూద్ కాలనీలో వారం, పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఇక్కడ స్థానికంగా అంధకారం నెలకొంది. కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నా తమకేమి సంబంధం లేన్నట్లు కొందరు వ్యవహరిస్తున్నారు. ఈ విషయం గురించి సంబంధిత కాంట్రాక్టర్‌ను స్థానికులు ప్రశ్నించారు. ఢిల్లీ నుంచి సామగ్రి వస్తేనే చేస్తామంటూ నిర్లక్షపు సమాధానం ఇచ్చారు. ఈ విషయం గురించి పట్టించుకునే అధికారులు లేకపోవడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇలా ఉదాసీనతగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైశాఖి బుద్ధ పౌర్ణమి పూజలు



పురుషోత్తమ్ మహారాజ్‌ను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్తలు

కందుకూరు: వైశాఖ బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మండల పరిధిలోని లేమూరులో గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన సర్వసంఘ్ పరిత్యాగి పురుషోత్తమ్ మహరాజ్ ప్రత్యేకంగా హాజరై భక్తులను ఆశీర్వదించారు. ఎన్నో సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయం అనతికాలంలోనే దిన దినాభివృద్ధి చెందిందన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక నాయకులు కోరుప్రోలు రాణాప్రతాప్‌రెడ్డి, రామ్‌ప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, గూడూరు మధుకర్‌రెడ్డి, ఢిల్లీ బాలకృష్ణ, సూరంపల్లి సురేష్, మహాదేవ్‌త్రిపాఠి, తోశాంత్‌త్రివేది, నవీన్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చామంతి సాగు భలే బాగు



మాచన్‌పల్లిలో జర్మన్ పూలసాగు

పూల తోటలకు ఇదే మంచి సమయం

- రాబడి ఆశాజనకం
- ఆసక్తి చూపుతున్న రైతులు

షాబాద్: చామంతి పూలసాగుకు ఇదే మంచి సమయం రానే వచ్చింది. దీంతో పొలాలను సిద్ధం చేసుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. పండుగలు, పెళ్లిళ్లు, పూజలకు చామంతి పూలను ఎక్కువగా ఉపయోగిస్తారు. దీంతో వాటికి డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. రాబడి కూడా అదే మాదిరిగానే వస్తుంది. చామంతి సాగుకు నల్లరేగడి, బరక నేలలు అనుకూలంగా ఉండడంతో వాటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా వందలాది ఎకరాల్లో చామంతి, బంతిపూలను రైతులు వేస్తున్నారు. ఎక్కువమంది రైతులు చామంతి సాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కోరైతు కనీసం రెండు నుంచి మూడెకరాలకు తగ్గకుండా నాలుగు రకాల చామంతి పూలను సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు.

పంట కాలం...

చామంతి సాగు జూన్, జూలై నెలలోనే సాగవుతుంది. సరిగ్గా ఆరు నెలలకు దిగుబడి వస్తుంది. ఆ సమయంలో కార్తీకమాసం, పండుగలు, పెళ్లిళ్ల వరుసగా వస్తుండడంతో పూలకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు చెబుతున్నారు.

సాగు చేసే గ్రామాలు...

షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, అంతారం, రుద్రారం, సోలిపేట్, మద్దూర్, మాచన్‌పల్లి, పోలారం, పోతుగల్, చర్లగూడ, ఎల్గోండగూడ, చందనవెల్లి, తిర్మలాపూర్, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో కనీసం 50నుంచి 70ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అందులో తెలుపు, క్యారెట్, మేరిగోల్డ్, పేపర్‌వైట్, పసుపు, వంగపూత, ఎగ్‌వైట్ రకాల పంటలను వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూర్ తదితర రాష్ట్రాల నుంచి మొక్కలను తెచ్చుకుంటారు. ఒక్కో మొక్క రకాన్ని బట్టి రూ.1 నుంచి రూ.3 వరకు పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో చామంతి సాగుకు రూ. 60వేల వరకు ఖర్చవుతుంది. రెండు నెలల పాటు వారంలో రెండు కోతలు దిగుబడులు వస్తాయి. పంటకాలం పూర్తయ్యేలోగా ఎకరాకు దాదాపు 8 టన్నుల వరకు దిగుబడి అందుతుందని రైతులు చెబుతున్నారు. పండగల సమయంలో దాదాపు కేజీ చామంతి పూలు రకాన్ని బట్టి రూ.70 నుంచి రూ.120 వరకు ఉంటుంది.

నేడు విత్తన మేళా

తలకొండపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారి ఆధ్యర్యంలో ఈనెల శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే పంటల గురించి సమగ్ర సమాచారం, అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు 24న ఉదయం 10 గంటలకు పాలెం పరిశోధన స్థానానికి తరలిరావాలని ఏఓ కోరారు.

ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం: నిషేధిత ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని పలు షాపులు, హోటల్స్, వీధి వ్యాపారుల దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్స్‌ను స్వాధీనం చేసుకొని దుకాణాదారులకు జరిమానాలు విధించారు. మరోసారి వినియోగిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

కౌన్ బనేగా వైస్ చైర్మన్?

- నేడు ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక
- ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో ప్రత్యేక సమావేశం
- బరిలో కౌన్సిలర్ బర్ల మంగ
- క్యాంపుల్లో మెజార్టీ కౌన్సిలర్లు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారం జరుగనుంది. జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో కొత్త వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై గత నెల 4వ తేదీన అవిశ్వాసం పెట్టగా అది నెగ్గింది. అయితే తదనంతరం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వైస్ చైర్మన్ ఎన్నికలో జాప్యం చోటుచేసుకుంది. తిరిగి కొత్త వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

క్యాంపుల్లో కౌన్సిలర్లు....

వైస్ చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కౌన్సిలర్లు క్యాంపులకు తరలివెళ్లారు. అయితే వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ బర్ల మంగ.. మెజార్టీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకున్నట్లు సమాచారం. వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిని పదవి నుంచి దించేందుకు ఆమె వర్గీయులు నడిపించిన క్యాంపు రాజకీయాల గురించి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పుడు వైస్ చైర్మన్ పదవికి నోటిఫికేషన్ వెలువడినందున ఎలాగైనా దక్కించుకునేందుకు అవసరమయ్యే బల నిరూపణ కోసం కౌన్సిలర్లను ముందస్తుగా క్యాంపులకు తరలించారు. శుక్రవారం ఉదయం నిర్ణీత సమయంలోపు మున్సిపల్ కార్యాలయానికి కౌన్సిలర్లు చేరుకుంటారని తెలుస్తోంది. 24 మంది కౌన్సిలర్లలో 13 మంది బర్ల మంగకు మద్దతుగా నిలిస్తే వైస్ చైర్మన్‌గా ఆమె ఎన్నికౌతారు. ఆ దిశగా ఆమె భర్త, తెలంగాణ ఉద్యమకారుడు బర్ల జగదీశ్‌యాదవ్, చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి వర్గీయులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు బర్ల మంగకు మద్దతునిస్తున్నట్లు సమాచారం. ఈ పదవిని ఆశిస్తూ ఇంకా ఎవరైన పోటీలో ఉంటారా లేదా అనే అంశం శుక్రవారం తేటతెల్లం కానుంది.